సాక్షి
నిజామాబాద్
సోమవారం । 28 । ఏప్రిల్ । 2025



ముగిసిన అఖండ..

బోధన్‌లోని ఏకచక్రేశ్వరాలయంలో ఈనెల 20వ తేదీన ప్రారంభమైన అఖండ శివనామ సప్తాహం ముగిసింది.

- 8లో ▸



నిధులు సరిపోక..

బోధన్ పసుపు వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణ పనులు నిధులు సరిపోక అర్ధంతరంగా నిలిచిపోయాయి.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
44.2 /24.3

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మాదిగల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం



నిజామాబాద్ అర్బన్: ఎస్సీ వర్గీకరణ బిల్లులకు ఆమోదం తెలిపి మాదిగల జీవితాల్లో వెలుగులు నింపిన వ్యక్తి సీఎం రేవంత్‌రెడ్డి అని మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి అన్నారు. నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలందరూ కాంగ్రెస్‌కు రుణపడి ఉండాలన్నారు. 30 సంవత్సరాల వర్గీకరణ పోరాటానికి మొదటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో సహకరిస్తున్నారని అన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రమే మొదట చట్టం చేయడం ఎంతో గర్వకారణమన్నారు. మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు రాజ్‌గగన్, అధికార ప్రతినిధి మల్లాని శివ, హరీశ్, గంగాధర్ గైక్వాడ్, గణేశ్, సాయికాంబ్లే తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి స్వల్ప ఇన్‌ఫ్లో

- ఎగువ నుంచి 3,472 క్యూసెక్కుల వరద
- పెరుగుతున్న నీటి మట్టం



బాల్కొండ: ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి స్వల్ప ఇన్‌ఫ్లో వస్తోంది. అకాల వర్షాలు కురవడంతో 3,472 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా, ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 100 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 382 క్యూసెక్కుల నీరుపోతోంది. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం సాయంత్రం 1061.00 (11.54 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

చెక్‌డ్యాం పనులు అడ్డగింత



మోపాల్: మండలంలోని తాడెంలో రూ.3.57 కోట్లతో చేపట్టిన చెక్‌డ్యాం నిర్మాణ పనులను స్థానిక రైతులు ఆదివారం అడ్డుకున్నారు. పనులు చేపట్టే క్రమంలో తమ భూముల్లోకి చొచ్చుకువస్తున్నారని రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న నీటిపారుదల శాఖ డీఈ బాలరాజు, ఏఈ శ్రీనివాస్, గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు అక్కడికి చేరుకొని రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. భూమి సర్వే చేసిన తరువాతే పనులు చేపట్టాలని అప్పటి వరకు నిలిపివేయాలని పట్టుబట్టారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు జోక్యం చేసుకొని పనులను నిలిపివేయొద్దని రైతుల అవసరం మేరకు పనులు కొనసాగుతున్నాయని వారిని సముదాయించారు. తాము సోమవారం వచ్చి హద్దులు గుర్తిస్తామని, అప్పటి వరకు పనులను అడ్డుకోవద్దని తహసీల్దార్, సర్వేయర్ రైతులకు ఫోన్‌లో సూచించారు.

రేపు కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం

నిజామాబాద్ సిటీ: సంస్థాగత ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ శ్రేణులకు జిల్లా కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డిచ్‌పల్లిలోని కేఎన్ఆర్‌గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే ఆర్ భూపతిరెడ్డి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, ఆర్మూర్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, బాల్కొండ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి, బాన్సువాడ బాధ్యులు రవీందర్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

ఆరుతడికి ఆదరణ ఏదీ?

ఆరుతడి పంటలకు ఆదరణ దక్కకపోగా ఏడాదికేడాది వరి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. మొత్తం పంటల సాగులో 83 శాతం వరి ఉండడం ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతోంది. వరిసాగు కారణంగా విద్యుత్ వినియోగం పెరగడంతోపాటు భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, రైతులకు ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఖరీఫ్ సీజన్‌లోనూ ఆరుతడి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు కనిపించడం లేదు.



ఏడాదికేడాది పెరుగుతున్న వరి సాగు విస్తీర్ణం

- మొత్తం పంటల సాగులో 83 శాతం వరే..
- పర్యావరణం, ప్రభుత్వంపై పెనుభారం

ఇందల్వాయి: ఆరుతడి పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. మరోవైపు వరి సాగు విస్తీర్ణం ఏడాదికేడాది పెరుగుతోంది. సన్నధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించడం, ఆరుతడి పంటలకు కనీస మద్దతు ధర లేకపోవడంతో వరి సాగు అంచనాలకు మించి సాగవుతోంది. దీంతో ఆరుతడి సాగుకు ఆదరణ తగ్గిపోతోంది.

పంటల సాగులో భారీ అంతరం కారణంగా వాతావరణ సమతుల్యత దెబ్బ తినడమే కాకుండా ప్రభుత్వంపై ఆర్థికంగా పెనుభారం పడుతోంది. అంతే కాకుండా అపరాలు, నూనె గింజలు, కూరగాయల సాగు వేగంగా పడిపోయి, దిగుమతులపై ఆధారపడి వాటి ధరలు అమాంతం పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

వరి సాగు వివరాలు

2024–25 యాసంగి సీజన్‌లో జిల్లాలో 5,16,266 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అందులో 4,27,723 ఎకరాల్లో అంటే పూర్తి సాగులో (83 శాతం) వరి పంట ఉండగా కేవలం 88,543 ఎకరాల్లో ఆరుతడి పంటలు (17 శాతం మాత్రమే) సాగయ్యాయి. 2023–24 యాసంగి సీజన్‌లో 95,757 ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగుకాగా, ఏడాది వ్యవధిలోనే సుమారు ఏడు వేల ఎకరాల సాగు విస్తీర్ణం తగ్గిపోయింది.

ఖరీఫ్‌లోనూ పెరిగే అవకాశం లేదు

జిల్లాలో వరి సాగు విస్తీర్ణం ఏడాదికేడాది పెరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2025–26 ఖరీఫ్ సీజన్ పంటల ప్రణాళిక ఖరారుకాగా, జిల్లా వ్యాప్తంగా 5.21లక్షల ఎకరాలకు పైగా పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో అత్యధికంగా వరి 4.32లక్షల వరి ఎకరాల్లో సాగయ్యే అవకాశమున్నట్లు పేర్కొంది. ఈ లెక్కన ఆరుతడి పంటల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు లేవు.

మార్పు రావాలంటే..

వరి సాగుతో తాత్కాలిక ప్రయోజనాల కన్నా దీర్ఘకాలిక నష్టాలే ఎక్కువ అని రైతులకు అవగాహన కలిపిస్తూ ఆరుతడి పంటల సాగుకు కచ్చితమైన ప్రణాళికలు రూపొందించాలి. అందుకు అపరాలు, చిరుధాన్యాలు, నూనె గింజలు, మొక్కజొన్న, గోధుమ పంటల సాగును ప్రోత్సహించేందుకు వాటి మద్దతు ధరలను పెంచడమే కాకుండా సాగుకు అవసరమైన విత్తనాలు, సూక్ష్మ బిందు సేద్యం పరికరాలు, పంట నూర్పిడి యంత్రాలను రైతులకు ఏటా రాయితీపై అందించాలి. ఆరుతడి పంటల సాగుతో కలిగే ప్రయోజనాలపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలి.

ప్రకృతికి.. ప్రభుత్వానికీ భారమే..!

పంట మార్పిడి లేకుండా అంచనాలకు మించి వరిసాగు కారణంగా విద్యుత్ వినియోగం పెరగడంతోపాటు విలువైన భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి.

ఓవైపు నేల ఆరోగ్యానికి హానికరమైన రసాయన ఎరువులను విచ్చలవిడిగా వాడుతుండగా, మరోవైపు రాయితీతో కూడిన ఎరువులు, విద్యుత్ రూపంలో ప్రభుత్వానికి భారం పడుతోంది. రసాయన ఎరువులు భూమిలో కలవడం, భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో రైతులు నీటి జాడ కోసం వందల ఫీట్ల లోతు బోరు బావులను తవ్విస్తున్నారు. అయినప్పటికీ నీరురాకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. వరి పొలాల నుంచి గ్లోబల్ వార్మింగ్‌కి కారణమైన మిథేన్ వాయువు అధికంగా వెలువడుతున్నట్లు శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆరుతడికి బోనస్ అందించాలి



మా ఊరు ఎత్తయిన గుట్టల్లో ఉండటంతో నీటి లభ్యత తక్కువగా ఉంటుంది. అందువల్ల మేము వరి సాగు కుదరక ఎక్కువగా పత్తి, మొక్కజొన్న, సోయా వంటి ఆరుతడి పంటలనే సాగు చేస్తాం. ప్రభుత్వం ఆరుతడి పంటలను చిన్నచూపు చూడటంతో సాగు గిట్టుబాటు కావడం లేదు. ఇకనైనా ప్రభుత్వం ఆరుతడి పంటలు సాగు చేస్తున్న రైతులకు చేయూతనందించాలి. – సింగిడి భాస్కర్, రైతు, దొన్కల్

అనుకూల వాతావరణం



జిల్లాలో ఆరుతడి పంటల సాగుకు అనుకూలమైన నేలలతోపాటు చక్కని వాతావరణ పరిస్థితులు ఉన్నాయి. అయినా రైతులు వరి సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. ఆర్మూర్ డివిజన్‌లో ఎక్కువగా ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు. వరి సాగుకు ప్రభుత్వం అనుకూలంగా వ్యవహరించడంతో ఆరుతడి పంటల సాగు వేగంగా పడిపోతోంది. – గడ్డం సతీశ్‌రెడ్డి, దొన్కల్, మోర్తాడ్

చిన్నారిని బలిగొన్న కూలర్

- విద్యుదాఘాతంతో బాలిక మృతి



విహంకిత (ఫైల్)

మాక్లూర్ : కూలర్ షాక్‌తో చిన్నారి మృతి చెందిన ఘటన మాక్లూర్ మండలం చిక్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చిక్లికి చెందిన గడ్డం నవీన్ అర్చన దంపతులకు ఇద్దరు కుమార్తెలు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఉన్న అసెంబుల్డ్ ఐరన్ కూలర్ వద్ద తల్లిదండ్రులతోపాటు పెద్దకూతురు విహంకిత(5) నిద్రపోయింది. సుమారు 2 గంటల సమయంలో నిద్ర నుంచి మేల్కొన్న విహంకిత అకస్మాత్తుగా పక్కనే ఉన్న కూలర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురైంది. దీంతో ఇంటి దర్వాజ నుంచి వాకిట్లో పడిపోయింది. ఇంటి ఎదుట రహదారి గుండా వెళ్లేవారు గమనించి తల్లిదండ్రులకు తెలపడంతో విహంకితను హుటాహుటిన జన్నేపల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. కాగా, అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యుడు నిర్ధారించారు. అప్పటి వరకు తమతో ఆడుతూ పాడుతూ గడిపిన కూతురు ఆకస్మికంగా మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపించారు.



ఏప్రిల్‌లో వికసించిన మే పుష్పం

సాధారణంగా మే నెలలో కనిపించే అరుదైన పుష్పం ముందే వికసించింది. నిజామాబాద్ నగరంలోని హౌ సింగ్ బోర్డు కాలనీకి చెందిన నల్లగంటి శ్రీలతా నర్సయ్య ఇంట్లో వికసించిన మే పుష్పాన్ని చుట్టుపక్కల వారు ఆసక్తిగా తిలకిస్తున్నారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

రెండేళ్లలో ప్రాణహిత చేవెళ్ల నీళ్లు



న్యావనందిలో బైపాస్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

- పాత డిజైన్ ప్రకారమే మంచిప్ప ప్రాజెక్టు
- భూ భారతితో సమస్యలకు పరిష్కారం
- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

సిరికొండ : నియోజకవర్గంలోని లక్ష ఎకరాలకు రెండేళ్లలో ప్రాణహిత – చేవెళ్ల నీరందిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని పెద్ద వాల్గోట్, పోత్నూర్, కొండూర్, సిరికొండ, చిన్నవాల్గోట్, న్యావనంది, రావుట్ల, జగదాంబ తండాల్లో రూ.10.23 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో జరిగిన సమీక్షలో పాత డిజైన్ ప్రకారమే మంచిప్ప ప్రాజెక్టు పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రాజెక్టు మిగులు పనులు త్వరగా పూర్తి చేయకపోతే ధర్నా చేస్తానని చెప్పినట్లు గుర్తుచేశారు. సిరికొండ మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయిస్తానన్నారు. సన్నబియ్యం పంపిణీతో పేదల ముఖాల్లో సంతోషం వెల్లివిరుస్తోందని, భూ భారతితో భూ సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల అమలు కోసం ఏకగ్రీవ తీర్మానం చేస్తే కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. పహల్గాం ఉగ్రదాడి కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమేనని, ఉగ్రవాదులు దాడి చేస్తే హిందూ ముస్లింల మధ్య చిచ్చు పెట్టేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఏం చేశారని రజతోత్సవాలు చేసుకుంటున్నారని బీఆర్ఎస్‌ను ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వంపై బీజేపీ, బీఆర్ఎస్ కుటిల పన్నాగాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ఎర్రన్న, ఉమ్మాజీ నరేశ్, పార్టీ మండలాధ్యక్షుడు బాకారం రవి, పీఏసీఎస్ చైర్మన్ గంగాధర్, దేగాం సాయన్న, ఏఎంసీ డైరెక్టర్లు ముత్తెన్న, సంపత్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రూరల్ అధ్యక్షుడు మహేందర్, మండలాధ్యక్షుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఐడీసీఎంఎస్‌లో అనిశ్చితి..!

- పాలకవర్గమా? పర్సన్ ఇన్‌చార్జినా..? స్పష్టత కరువు
- చైర్మన్‌లకు అనుకూలంగా కోర్టు తీర్పు?
- సపోర్టింగ్ ఆర్డర్ వెలువడక డైలమా
- రెండు నెలలుగా నిలిచిన ఆర్థిక కార్యకలాపాలు
- ఉద్యోగులకు జీతాల్లేక తీవ్ర ఇబ్బందులు



మోపాల్(నిజామాబాద్‌రూరల్): జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థ (ఐడీసీఎంఎస్)లో అనిశ్చితి నెలకొంది. పాలకవర్గం గడువు ముగిసి రెండు నెలలు గడిచిపోయింది. పాలకవర్గాలకు గడువు పెంచకపోగా, అదనపు కలెక్టర్లను పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఆ వెంటనే చైర్మన్లు కోర్టును ఆశ్రయించగా, పాలకవర్గం గడువు పెంచాలని తీర్పునిచ్చింది. కానీ ప్రభుత్వం సపోర్టింగ్ ఆర్డర్ ఇవ్వకపోవడంతో రెండు నెలలుగా ఆర్థిక కార్యకలాపాలతోపాటు ఉద్యోగుల జీతాలు నిలిచిపోయాయి. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

చైర్మన్‌లకు అనుకూలంగా తీర్పు?

ప్రభుత్వం ఎన్‌డీసీసీబీల పాలకవర్గాల గడువు పెంచినప్పటికీ.. ఐడీసీఎంఎస్ పాలకవర్గాలకు గడువును పొడిగించలేదు. పర్సన్ ఇన్‌చార్జీలుగా అదనపు కలెక్టర్లను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో డీసీఎంఎస్‌ల చైర్మన్‌లు కోర్టును ఆశ్రయించగా, పాలకవర్గాల గడువు పొడిగించాలని చైర్మన్‌లకు అనుకూలంగా కోర్టు తీర్పునిచ్చింది. కానీ కోర్టు తీర్పునకు ప్రభుత్వం సపోర్టింగ్ ఆర్డర్ ఇవ్వాల్సి ఉంటుంది. తీర్పు అమలు చేయడం లేదని మరోసారి చైర్మన్‌లు కోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 9డీసీఎంఎస్‌లలో పరిస్థితి ఇదే మాదిరిగా ఉంది. కాగా ఆర్డర్ ఇవ్వకపోవడానికి గల కారణాలు అనేకమైనప్పటికీ.. సంబంధిత కమిషనర్ సెలవులో ఉన్నారని, రాజకీయ కారణాలనే ప్రచారం కూడా జరుగుతోంది.

ఉద్యోగులు.. విధులు

ఐడీసీఎంఎస్‌లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మేనేజర్ సహా 20 మంది ఉద్యోగులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం 20 వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు నడుస్తున్నాయి. దీనికితోడు మార్క్ ఫెడ్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా యూరియా, ఇతర ఎరువుల విక్రయాలు, పంట ఉత్పత్తుల కొనుగోళ్లు, తదితర కార్యకలాపాలు కొనసాగుతుంటాయి.

రెండు నెలలుగా జీతాల్లేవు

డీసీఎంఎస్ పాలకవర్గం లేదా పర్సన్ ఇన్‌చార్జి కొనసాగింపుపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో రెండు నెలలుగా 20 మంది ఉద్యోగులు, సిబ్బందికి జీతాలు చెల్లించడం లేదు. నెలకు సుమారు రూ.6 లక్షల వరకు జీతాల రూపేణ చెల్లించాల్సి ఉంటుంది. చెక్ పవర్ జాయింట్‌గా ఉండటం, డీసీఎంఎస్ పాలకవర్గం లేదా పర్సన్ ఇన్‌చార్జి కొనసాగింపుపై స్పష్టత లేకపోవడం ఉద్యోగుల పాలిట శాపంగా మారింది. జీతాలు రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇతర ప్రభుత్వ రంగ సంస్థలకు సైతం రూ.లక్షల్లో బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి త్వరగా నిర్ణయం తీసుకుని జీతాలు చెల్లించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

స్పష్టత రావాల్సి ఉంది



ప్రభుత్వం డీసీఎంఎస్‌కు పర్సన్ ఇన్‌చార్జీగా నియమించడంతో బాధ్యతలు స్వీకరించాను. జాయింట్ చెక్ పవర్ కారణంగా జీతాలు, ఇతర ఆర్థిక కార్యకలాపాలు నిలిచిపోయింది వాస్తవమే. చైర్మన్లు కోర్టును ఆశ్రయించగా, అనుకూలంగా తీర్పు వచ్చిందని తెలిసింది. ప్రభుత్వం సపోర్టింగ్ ఆర్డర్ ఇవ్వాల్సి ఉంది. ఈ విషయమై స్పష్టత రావాల్సి ఉంది.

– కిరణ్‌కుమార్, అదనపు కలెక్టర్

‘యువ వికాసం’పై క్షేత్రస్థాయి పరిశీలన

- జిల్లాలో 58వేలకుపైగా దరఖాస్తులు
- క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశం
- దరఖాస్తుదారుల ఇళ్లకు అధికార బృందాలు



భీమ్‌గల్‌లో దరఖాస్తుదారు వివరాలు తెలుసుకుంటున్న మున్సిపల్ ఉద్యోగులు

మోర్తాడ్(బాల్కొండ): రాజీవ్ యువ వికాసం దరఖాస్తులపై అధికార బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభించాయి. నిరుద్యోగ యువతీయువకులకు రాయితీ రుణాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా 58 వేలకు పైగా దరఖాస్తులు అందగా 22 వేలకుపైగా యూనిట్లకు రుణాలను అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. దీంతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అందిన దరఖాస్తుల వివరాలను మరోసారి తెలుసుకునేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. గ్రామాలలో మండల పరిషత్ అధికారులు, మున్సిపాలిటీలలో వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది దరఖాస్తుదారుల వివరాలు సేకరిస్తున్నారు. సరైన ధ్రువపత్రాలు జత చేయని దరఖాస్తుదారులకు ఫోన్ చేసి సర్టిఫికెట్లను తెప్పించుకుంటున్నారు.

ఒక రేషన్ కార్డుపై ఒక్కరికే అవకాశం

రాజీవ్ యువవికాసం రాయితీ రుణాలను ఒక రేషన్ కార్డుపై ఒకరికే అందించే అవకాశ ఉంది. ఒక కార్డుపై ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుంటే ఒక్క దరఖాస్తునే పరిగణలోకి తీసుకుంటున్నారు. ఎక్కువ దరఖాస్తులు ఉంటే కార్డు హోల్డర్‌ను సంప్రదించి ఒక దరఖాస్తును పరిశీలించడానికి ఆమోదం తీసుకుంటున్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాయితీ రుణాలు పంపిణీ చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో అంతలోపు అధికారులు దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి నివేదికలను ప్రభుత్వానికి పంపనున్నారు. కాగా, లబ్ధిదారుల ఎంపిక ఏ విధంగా చేపట్టే అవకాశం ఉందో ఇప్పటికీ స్పష్టత లేదు. ఒక్కో మండలంలో ఎన్ని యూనిట్లకు రుణాలను అందించే అవకాశం ఉందో వెల్లడించకపోవడం గమనార్హం.

పరిశీలన జరుగుతోంది

క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన సాగుతోంది. దరఖాస్తుదారులు ఎవరైనా సర్టిఫికెట్‌లను జత చేయకపోతే తెప్పించుకుంటున్నాం. అర్హుల ఎంపికపై అధికారుల ఆదేశాలను పాటిస్తాం.

– శ్రీధర్, ఎంపీవో, మోర్తాడ్

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

- పారదర్శకంగా భూముల వివరాలు
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్: నిర్దిష్ట గడువు లోపు రైతుల భూ సమస్యలను పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకొచ్చిందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పేర్కొన్నారు. నూతన ఆర్‌వోఆర్ చట్టంతో భూ రికార్డులను సవరణ చేసుకునే అవకాశం కల్పించారన్నారు. నిజామాబాద్ నార్త్, సౌత్ మండలాల పరిధిలోని రైతులకు అర్సపల్లి గ్రామ చావిడిలో ఆదివారం ఏర్పాటు చేసిన సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. రైతులు తమ భూముల రికార్డులకు సంబంధించిన పొరపాట్లను స్థానికంగానే సరి చేసుకునేందుకు తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్లకు అధికారాలు ఇచ్చినట్లు తెలిపారు. చట్టం అమలులోకి వచ్చిన ఏడాదిలోపు రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మే, జూన్ మాసాల్లో గ్రామాలలో సదస్సులు ఏర్పాటు చేసి, భూ సమస్యలపై అధికారులు రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. క్షేత్రస్థాయిలో సర్వే, విచారణ జరిపిన తర్వాతే భూమి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయనున్నట్లు కలెక్టర్ వివరించారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ సమయంలో తప్పిదాలు చోటుచేసుకున్నాయని, సరైన న్యాయం జరగలేదని భావిస్తే సంబంధిత రైతులు అప్పీలు చేసుకునే అవకాశం కల్పించారన్నారు. అప్పీలు చేసుకున్న పేద రైతులకు దేశంలోనే తొలిసారిగా ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. ప్రతి గ్రామంలో భూ మార్పుల రిజిస్టర్, చెరువులు, కుంటలు వంటి భూముల రిజిస్టర్, గ్రామ పహాణీ, ప్రభుత్వ భూముల రిజిస్టర్లను నిర్వహిస్తారన్నారు. ఆధార్ తరహాలోనే భూకమతాల వారీగా భూధార్ సంఖ్య కేటాయిస్తారని, దీంతో భూ వివాదాలకు ఆస్కారం ఉండదని, ఆక్రమణలకు అడ్డుకట్ట పడుతుందని అన్నారు. సదస్సులో ఇన్‌చార్జి ఆర్డీవో స్రవంతి, సౌత్, నార్త్ తహసీల్దార్లు బాలరాజు, నాగార్జున, రైతులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

క్లుప్తంగా

‘జయంత్యోత్సవాలకు తరలిరావాలి’



బోధన్‌: పట్టణంలో ఈనెల 30న అంబేడ్కర్, జ్యోతిబాపూలే, జగ్జీవన్‌రాం జయంతిని పురస్కరించుకుని నిర్వహించనున్న మహనీయుల జయంత్యోత్సవ సభ, ర్యాలీకి ప్రజలు తరలిరావాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర ప్రతినిధి పరిమి కోటేశ్వర్‌రావు కోరారు. బోధన్‌లోని తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో ఆదివారం డివిజన్ కమిటీ ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా వేలాది మందితో ర్యాలీ నిర్వహించనున్నామని, సభను అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. కమిటీ కన్వీనర్ నీరడి ఈశ్వర్, ప్రతినిధులు రవి కుమార్, వెంకటి, సింగాడి పాండు, సూర్యకాంత్, దేవేందర్, కారం స్వామి, రాహుల్, సురేందర్ పాల్గొన్నారు.

ఐకమత్యంతో ముందుకు సాగాలి



నిజామాబాద్ రూరల్‌: బ్రాహ్మణులు ఐకమత్యంతో ముందుకు సాగాలని రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య శాశ్వత చైర్మన్ వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ పేర్కొన్నారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో బ్రాహ్మణులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం జిల్లా కేంద్రంలోని అర్సపల్లి పురుషోత్తం గుప్త కల్యాణ మండపంలో నిర్వహించారు. రాష్ట్రంలో పరిషత్ ద్వారా వచ్చే నిధులు త్వరలోనే విడుదలవుతాయని తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోత్కూరి రామేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న పేద బ్రాహ్మణులకు, పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించేలా కృషి చేస్తామన్నారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర శాశ్వత చైర్మన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉమాకాంత్, డాక్టర్ చంద్రశేఖర్ బిర్లా రామారావు, భూపతి రావు, ప్రవీణ్ కులకర్ణి, గాయత్రి కులకర్ణి, శరత్ కుమార్, వైద్య రణధీర్, ప్రవీణ్ మహరాజ్, రాజగోపాల చారి, రామ్ శ్యామ్, నవీన్, విజయ్, సభ్యులు పాల్గొన్నారు.

నేత్ర, శరీర అవయవ దాతల సంఘం కన్వీనర్‌గా ప్రేమ్‌లాల్



నిజామాబాద్ రూరల్‌: తెలంగాణ నేత్ర శరీర అవయవ దాతల సంఘం నిజామాబాద్ సిటీ కన్వీనర్‌గా బానోత్ ప్రేమ్‌లాల్ నియామకం అయ్యారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కామిడి సతీశ్‌రెడ్డి ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు.

నిధులు సరిపోక నిలిచిన పనులు

- బోధన్ శివారులోని పసుపువాగుపై ఏడాది క్రితం వంతెన పనులు ప్రారంభం
- రూ.3కోట్ల నిధులు సరిపోక అర్ధంతరంగా నిలిచిన బ్రిడ్జి నిర్మాణం





బోధన్ శివారులోని పసుపు వాగుపై అర్ధంతరంగా నిలిచిన వంతెన నిర్మాణం

బోధన్‌: బోధన్ పట్టణ శివారులోని బోధన్–బాన్సువాడ బైపాస్ రోడ్డు సమీపంలో గల పసుపు వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. పనులకు కెటాయించిన నిధులు సరిపోక, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీన వైఖరి ఇలా అనేక కారణాల వల్ల పనులు అర్ధాంతరంగా నిలిచిపోయి, ముందుకు సాగడం లేదు. కాలయాపన వల్ల పనుల అంచనా వ్యయం పెరిగిపోతోంది. మరో వైపు అదనపు నిధుల కోసం పంపిన ప్రతిపాదనలు మేరకు నిధుల మంజూరులో అలస్యం జరుగుతోంది. అయినా పాలకులు, అధికారులు స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

ఐదేళ్ల క్రితం ప్రతిపాదనలు..

పసుపు వాగుపై వంతెన నిర్మాణం కోసం 2021–22 ఆర్థిక సంవత్సంరలో పీఎంజీఎస్‌వై (ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన) కింద రూ. 3కోట్ల నిధులు మంజూరయ్యాయి. పీఆర్ ఇంజినీరింగ్ శాఖ పనుల కోసం టెండర్లు నిర్వహించగా 2023లో ప్రక్రియ పూర్తి చేసి కాంట్రాక్టర్‌కు అప్పగించారు. 2023 సెప్టెంబర్‌లో పనులు ప్రారంభించి 2025 మార్చి 1వరకు పూర్తి చేయాలని గడువు విధించారు. కానీ గడువు ముగిసిపోయిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. 10 పిల్లర్లు నిర్మించగా, రెండు పిల్లర్ల మేర స్లాబ్ వేసి వదిలేశారు. ఐదేళ్ల క్రితం ప్రతిపాదనల మేరకు మంజూరైన నిధులతో పనులు పూర్తి చేశామని, మరో రూ.3 కోట్లు నిధులు మంజూరుకు ఏడాదిక్రితమే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు అధికారులు చెబుతున్నారు. నిధులు ఎప్పుడు మంజూరవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

బోధన్–కోటగిరి మండలాలకు అనుసంధానం

బోధన్ పట్టణ శివారు నుంచి పసుపు వాగు వంతెన మీదుగా కోటగిరి మండలంలోని ఎత్తొండ, రాయ్‌కూర్, దోమలెడ్గి వరకు సుమారు 14 కిలో మీటర్ల పొడువున పీఎంజీఎస్‌వై కింద రూ.6 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టి రెండేళ్ల క్రితమే పూర్తిచేశారు. వాగుపై చేపట్టిన వంతెన నిర్మాణం పూర్తి చేస్తే కోటగిరి మండల ప్రజలకు పట్టణ కేంద్రానికి వచ్చేందుకు దూరం తగ్గడమే కాక మరింత సౌకర్యంగా మారనుంది. ప్రస్తుతం వాగులో తాత్కాలికంగా వేసిన మట్టి రోడ్డు మీదుగా రెండు మండలాల ప్రజలు రాకపోకలు సాగుతున్నాయి. అలాగే పసుపు వాగు అవతలి ఒడ్డున పట్టణ రైతులకు సంబంధించి 250 ఎకరాలకు పైగా సాగు భూములున్నాయి. వర్షాకాలంలో పంట పొలాలకు వెళ్లెందుకు ఏళ్లుగా రైతులు తీవ్ర కష్టాలు పడుతున్నారు. వంతెన పూర్తయితే సాగు కష్టాలు తీరుతాయని సంబుర పడ్డారు. కానీ పనులు ముందుకు సాగకపోవడంతో రైతులు, ఇరు మండలాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి, పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి



పసుపు వాగు అంచున నా పొలాలున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న వంతెన నిర్మిస్తామంటే కాంట్రాక్టరుకు నా సొంత సాగు భూమిని ఇసుక, కంకర, ఇతర సామగ్రి నిల్వ కోసం కౌలు ధరకు ఇచ్చాను. ఏడాదిన్నర కావస్తున్న పనులు ముందుకు సాగడం లేదు. సామగ్రి పంట పొలంలోనే మిగిలిపోయి ఉంది. ఈ ఏడాదికి సంబంధించి రావాల్సిన కౌలు డబ్బులు రూ.లక్షా 35 వేలు కాంట్రాక్టరు చెల్లించడం లేదు. వంతెన పనులు త్వరితగతిన పూర్తి చేస్తే రైతులకు మేలు జరుగుతోంది.

– బుర్క చిన్న లింగాగౌడ్, రైతు, పాన్‌గల్లీ, బోధన్

ప్రతిపాదనలు పంపించాం..

పసుపు వాగుపై చేపట్టిన వంతెన పనులు పూర్తికి మరో రూ.3 కోట్లు మంజూరుకు రివైజ్డ్ ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించాం. గతంలో మంజూరైన నిధుల మేరకు పనులు పూర్తి చేశాం. నిధులు సరిపోకనే పనులు నిలిచాయి. వంతెన స్లాబ్, సైడ్‌వాల్స్, ఇరువైపులా అప్రోచ్ బీటీ రోడ్డు నిర్మాణం పనులు మిగిలిపోయాయి. నిధులు రాగానే పనులు చేపట్టి పూర్తి చేస్తాం.

– పవన్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఏఈ, బోధన్

ఉగ్రవాదులను ఉరితీయాలి



నగరంలోని హనుమాన్ జంక్షన్ వద్ద కొవ్వొత్తులతో అమరులకు నివాళులు అర్పిస్తున్న కాలనీవాసులు

నిజామాబాద్ సిటీ: జమ్మూ–కాశ్మీర్‌లో ఇటీవల పర్యాటకులపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులను ఉరితీయాలని నగరంలోని మహాలక్ష్మినగర్ కాలనీ వాసులు డిమాండ్ చేశారు.

ఉగ్రవాదులు జరిపిన దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమరులకు ఆదివారం మహాలక్ష్మి నగర్ కాలనీ–2, తెలంగాణ పార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పాకిస్తాన్ ప్రేరిత ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పాలని, అమాయక హిందువులపై దాడి చేసిన ఉగ్రవాదులను ఉరితీయాలని ముక్తకంఠంతో నినదించారు. కాలనీవాసులు మల్లేష్ రెడ్డి, శంకర్ గౌడ్, మూర్తి, కిరణ్ కుమార్, గంగాధర్, మల్లెపూల నర్సయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అఖండ శివనామ సప్తాహం



ఏకచక్రేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు..



మఠాధిపతిని సన్మానిస్తున్న సప్తాహం నిర్వాహకులు

బోధన్‌: పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో ఈనెల 20న ప్రారంభమైన అఖండ శివనామ సప్తాహం ఆదివారం సాయంత్రం ముగిసింది. ఏడు రోజుల పాటు ఆలయంలో ఉదయం 5గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు శివనామ సంకీర్తన, భజనలు, పరమ రహస్య గ్రంథ సామూహిక పారాయణ, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. మహారాష్ట్ర ప్రాంత బేట్‌మోగ్రా వీరశైవ మఠాధిపతి సద్గురు సిద్ధ దయాళ్ శివాచార్య మహారాజ్ సప్తాహం ప్రారంభం నుంచి ఆఖరి వరకు ఆధ్యాత్మిక అంశాలపై ప్రవచనాలు చేశారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని శనివారం రాత్రి సామూహిక ఇష్టలింగ అభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహారాష్ట్ర ప్రాంతం లాతూర్ జిల్లాకు చెందిన మహిళ భజన కళాకారులు, గాయకులు ఆటపాటలతో శివనామ స్మరణ గేయాలు ఆలపించి ఆకట్టుకున్నారు. వీరశైవ సమాజ్ గురువులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మీయ పలకరింపులు.. మధుర స్మృతులు

- జిల్లాలో పలుచోట్ల సమ్మేళనాలు నిర్వహించిన పూర్వవిద్యార్థులు
- ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో భావోద్వేగానికి గురైన మిత్రులు



బోధన్‌లోని శ్రీనివాస ట్యుటోరియల్ కాలేజీ 1991-92 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



పల్లికొండ జెడ్పీహెచ్‌ఎస్ 1997-98 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



ఆలూర్ జెడ్పీహెచ్‌ఎస్ 1999-2000 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

పెర్కిట్(ఆర్మూర్)/మాక్లూర్/రెంజల్/బోధన్‌టౌన్/మోర్తాడ్‌: ఆత్మీయ పలకరింపులు.. ఆపాత మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకుని పూర్వ విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. అరే ఎన్నాళ్లయింది కలుసుకుని.. పూర్తిగా మారిపోయావంటూ ఆనాటి స్నేహితులు ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో హర్షం వ్యక్తంచేశారు. జిల్లాలోని వివిధ గ్రామాల ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నానాటి మిత్రులందరూ ఏళ్ల తర్వాత మళ్లీ ఒకే వేదికపై కలుసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఒకరినొకరు పలకరించుకుంటూ అనాటి జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకున్నారు. నాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను సమ్మేళనానికి ఆహ్వానించి, సన్మానించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం విద్యార్థులు, గురువులు అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.



కల్లెడి జెడ్పీహెచ్‌ఎస్ 2005-06 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



రెంజల్ జెడ్పీహెచ్‌ఎస్ 2005-06 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



తాళ్లరాంపూర్ జెడ్పీహెచ్‌ఎస్ 2000-01 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో బల్దియా కార్మికుడికి గాయాలు



నిజామాబాద్ సిటీ: నగర కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్న శంకర్‌కు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. శంకర్ డంపింగ్ యార్డులో శనివారం విధులు ముగించుకొని బైక్‌పై తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఎదురుగా ఓ వ్యక్తి బైక్‌తో వచ్చి ఢీకొట్టాడు. ఈ ఘటనలో శంకర్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన మాక్లూర్ మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన వ్యక్తిని ఐదో టౌన్ పోలీసులకు అప్పగించారు.

రుద్రూర్‌లో వ్యవసాయ కళాశాల కోసం ప్రయత్నాలు

- ఎమ్మెల్యే, ఎంపీకి వినతిపత్రాలు అందజేత



హైదరాబాద్‌లో ఎంపీ సురేశ్‌షెట్కార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైడ్స్ సభ్యులు (ఫైల్)

రుద్రూర్‌: రుద్రూర్ మండలం అక్బర్‌నగర్ శివారులో వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉమ్మడి జిల్లాకు వ్యవసాయ కళాశాలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర సచివాలయంలో ఫిబ్రవరిలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో నిజామాబాద్ జిల్లా రుద్రూర్‌లో, నల్గొండ జిల్లా కంపసాగర్‌లో వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. దీంతో ఈ ప్రాంత వాసులు, రైతులు వ్యవసాయ కళాశాల కోసం ఎదురు చూస్తున్నారు. ఇక్కడ కళాశాల ఏర్పాటుకు అవసరమగు స్థలం, మౌలిక వసతులు ఉన్నాయి. వ్యవసాయ విద్యాబోధనకు అనుకూలమైన వాతవరణం ఉంది. ఇక్కడ పరిశోధన కేంద్రంతో పాటు కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, ఆహార శాస్త్ర విజ్ఞాన కళాశాలలు ఉన్నాయి. పరిశోధన కేంద్రం ద్వారా వ్యవసాయ పద్ధతలను మెరుగుపరచడం, చీడపీడల నివారణ, వరి, చెరకులో కొత్త వంగడాలను రూపొందించి రైతులకు పరిచయం చేస్తున్నారు. ఇది రాష్ట్ర వ్యవసాయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ సురేశ్ షెట్కార్‌ను ఇటీవల స్వచ్ఛంద సంస్థ రైడ్స్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రాలు అందజేశారు. రుద్రూర్‌లో వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేస్తే ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం ఇచ్చినట్లవుతుందని వారు పేర్కొంటున్నారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం భూములను పరిశీలించడానికి అధికారులను పంపించాలని వ్యవసాయ శాఖ మంత్రిని స్థానికులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బిచ్కుంద(జుక్కల్‌): మండలంలోని హజ్గుల్ సమీపంలోగల మంజీరా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 10 ట్రాక్టర్లను కందర్‌పల్లి వద్ద ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. వేబిల్లు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం మేరకు తనిఖీలు చేపట్టి పట్టుకున్నట్లు ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు.

క్రైం కార్నర్

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

ఖలీల్‌వాడి/ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్ శివారులోని బైపాస్ రోడ్డులో గల మల్లారెడ్డి గెస్ట్‌హౌస్‌లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం నిజామాబాద్ సీసీఎస్ పోలీసులు దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం రావడంతో సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు నిజామాబాద్ సీసీఎస్ ఏసీపీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో సీసీఎస్ సీఐ రవికుమార్, సిబ్బంది దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకున్నారు. అలాగే వారి వద్ద నుంచి రూ.21830 నగదును స్వాధీనం చేసుకున్నారు. రూ.2,35,000 ఆన్‌లైన్ చెల్లింపులు యూపీఏల ద్వారా చెల్లించినట్లు గుర్తించి ఫోన్లను సీజ్ చేశారు. అనంతరం ఆర్మూర్ పోలీసులకు అప్పగించారు.

శివాలయంలో చోరీ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మెంగారం గ్రామంలోని శివాలయంలో దుండగులు చోరీకి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆలయం తాళాలను దుండగులు శనివారం రాత్రి ఇనుప రాడ్‌తో పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. అలాగే ఆలయంలో ఉన్న హుండీని పగుల గొట్టి నగదు, అమ్మవారి మెడలో గల బంగారు పుస్తెను అపహరించారు. ఆలయంలో చోరీ జరగడం ఇది నాలుగోసారి కావడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దొంగతనాల నివారణకు పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నగరంలో ఆపరేషన్ ఛబుత్రా



ఖలీల్‌వాడి: నగరంలోని బర్కత్‌పురా, గాజులపేట్, హయిత్‌గల్లీ, శివాజీనగర్, అహ్మద్‌పురా కాలనీలో ఆదివారం రాత్రి పోలీసులు ఆపరేషన్ ఛబుత్రా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా కాలనీల్లోని ప్రజల వాహనాలకు సంబంధించిన పత్రాలను పోలీసు సిబ్బంది పరిశీలించారు. 36 బైక్‌లు, 6 ఆటోలకు పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు. పాత నేరస్తులు, రౌడీషీటర్ల గురించి తెలుసుకున్నారు. ఎవరైనా అనుమానితులు ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. పట్టణ సీఐ శ్రీనివాస్ రాజు, ఎస్సైలు యాసీన్ ఆరాఫత్, హన్మండ్లు, ఆర్ఎస్సై అజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదుగురి ప్రాణాలు నిలబెట్టిన అవయవదానం



చరణ్‌రాజ్ (ఫైల్)

గాంధారి(ఎల్లారెడ్డి): తాను చనిపోయినా మరో ఐదుగురికి అవయవాలు దానం చేసి ప్రాణాలు నిలబెట్టాడు మండల కేంద్రానికి చెందిన యువకుడు మోచి చరణ్‌రాజ్(30). వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన మోచి రవి, పద్మ దంపతుల చిన్న కుమారుడు చరణ్‌రాజ్ హైదరాబాద్‌లో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 22న జరిగిన రోడ్డు ప్రమాదంలో అతడి తలకు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగా బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో అతడు కోలుకోవడం కష్టమని వైద్యులు సూచించడంతో శనివారం చరణ్ తల్లిదండ్రులు, భార్య పెద్ద మనసుతో అతడి అవయవాలు దానం చేసి మరో ఐదుగురి ప్రాణాలు నిలబెట్టారు. అనంతరం అతడి అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామంలో నిర్వహించారు.

విద్యుత్ షాక్‌తో పశువుల మృత్యువాత



మృతి చెందిన ఆవు

సిరికొండ: మండల కేంద్రంలోని చీమన్‌పల్లి రోడ్డులో ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుత్ షాక్‌తో ఆవు ఆదివారం మృతి చెందింది. సిరికొండకు చెందిన బొందెరి రవికి చెందిన ఆవు తన వ్యవసాయ క్షేత్రానికి సమీపంలో మేత మేస్తోంది. అక్కడే తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆవు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ. 60వేల వరకు ఉంటుందని, నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

పాల్దా గ్రామంలో..



మృతిచెందిన పాడిగేదె

నిజామాబాద్ రూరల్‌: మండలంలోని పాల్దా గ్రామ చెరువు శివారులో విద్యుదాఘాతంతో మూడు పాడిగేదెలు మృతిచెందినట్లు పాడిరైతులు ఆదివారం పేర్కొన్నారు. గ్రామానికి చెందిన సంగేశ్ ప్రశాంత్, చాకలి అశోక్‌కు చెందిన పాడిగేదెలు ఊరు బయట చెరువు వద్దకు మేతకు వెళ్లాయి. ప్రమాదవశాత్తు కిందపడిన విద్యుత్‌వైర్ గేదెలకు తగలడంతో కరెంట్‌షాక్‌తో మృతిచెందాయి. ప్రభుత్వం స్పందించి తమకు నష్టపరిహారం అందించాలని బాధిత పాడిరైతులు కోరారు.

అదృశ్యమైన వ్యక్తి.. నాలుగేళ్లకు ఆచూకీ లభ్యం



అజీమ్‌ను తన తమ్ముడికి అప్పగిస్తున్న అనం సేవా ఫౌండేషన్ ప్రతినిధులు

బోధన్‌టౌన్(బోధన్‌): పట్టణానికి చెందిన అబ్దుల్ అజీమ్ నాలుగేళ్ల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయి, ఆదివారం తిరిగి తనవాళ్లకు వద్దకు చేరుకున్నాడు. అనం ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపిన వివరాలు ఇలా.. బోధన్‌కు చెందిన అబ్దుల్ అజీమ్ నాలుగేళ్ల క్రితం మతిస్థిమితం కోల్పోయి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఖమ్మంలోని కారెపల్లిలో తిరుగుతూ ప్రజలపై దాడికి పాల్పడుతుండగా అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి మానసిక పరిస్థితిని గమనించి అనం సేవా ఫౌండేషన్‌కు అప్పగించారు. అక్కడ అతడికి వైద్య చికిత్స అందించగా కొద్ది రోజుల నుంచి తన కుటుంబ సభ్యుల వివరాలు వెల్లడిస్తుండంతో ఆదివారం అతడిని బోధన్‌కు తీసుకు వచ్చి ఆచన్‌పల్లిలో నివాసం ఉంటున్న వరుసకు తమ్ముడైన అబ్దుల్ నయీమ్‌కు పోలీసుల సమక్షంలో అప్పగించారు. ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాస్, రావట్ల జనార్ధన్, పద్మాసింగ్, పోలీసులు ఉన్నారు.